క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారిణి కె.వసుంధర

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారిణి కె.వసుంధర అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను ఆమె స్వీకరించారు. వాటిని విచారించి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీవుల్లా, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బి డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం



క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ బాబురాజు

ఆదోని టౌన్: క్షయ వ్యాధి నిర్మూలనకై ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌సాగర్ అన్నారు. సోమవారం పట్టణంలోని హనుమాన్‌నగర్ యూపీహెచ్‌సీలోని వడ్డేగేరిలో కౌన్సిలర్ బి.ప్రతిభ, లక్ష్మన్న సమక్షంలో టీబీ నిర్మూలన కార్యక్రమంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ సాగర్ ప్రజలకు క్షయవ్యాధి పట్ల అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వరి, సీతారాముడు, సుబ్బమ్మబాయి, వార్డు మెంబర్లు మల్లికార్జున, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

కోసిగి ఎంపీడీఓగా ఈశ్వరయ్యస్వామి



బాధ్యతలు తీసుకున్న ఈశ్వరయ్యస్వామి

కోసిగి: మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా సోమవారం ఈశ్వరయ్యస్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వెంకటేశ్వర్లు ప్యాపిలి మండలానికి బదిలీ కావడంతో ఆలూరుకు రెగ్యులర్ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఈశ్వరయ్యస్వామిని కోసిగి, మంత్రాలయ మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

మంత్రాలయం రూరల్: ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో అన్ని ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టాన్ని కాలరాస్తూ, పాఠశాలలో పుస్తకాలను వారి సొంత భవనాలలో అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. అనంతరం ఎంఈఓ-1 రాంపురం రాఘన్నకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అరుణాచ్యారి, దివాకర్, బాషా, వీరేష్, మోహన్ పాల్గొన్నారు.

వివాహం.. నమోదులో నిర్లక్ష్యం

- గ్రామాల్లో వివాహ రిజిస్ట్రేషన్లు శూన్యం
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- జోరుగా బాల్యవివాహాలు



గోనెగండ్ల: వివాహం అన్ని విషయాలలో ఘనమైనది, పవిత్రమైనది. అందుకే పట్టణాలలో వివాహమైన వెంటనే రిజిస్ట్రేషన్ నమోదు చేస్తారు. ఈ విధానం గ్రామీణ ప్రాంతాల్లో కూడా అమలు కావాలన్న లక్ష్యంతో 2012 సంవత్సరంలో వివాహ నమోదు కార్యక్రమం తీసుకొచ్చారు. క్షేత్రస్థాయిలో గ్రామీణులకు అవగాహన కల్పించి, పంచాయతీల్లోనే వివాహ రిజిస్ట్రేషన్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అయితే ఈ విధానం మండలంలో ఎక్కడ అమలు కావడం లేదు. కనీసం ప్రజలకు అవగాహన కల్పించడంలో కూడా అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా అక్కడక్కడా బాల్య వివాహాలు జరిగిపోతున్నాయి. కళ్ల ముందే బాల్య వివాహాలు జరుగుతున్న సంబంధిత అధికారులు తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఏటా వందకు పైగా వివాహాలు

గోనెగండ్ల మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా 28 గ్రామాలు ఉన్నాయి. 23 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ప్రతి ఏటా వందకు పైగా వివాహాలు జరుగుతున్నాయి. కానీ పంచాయతీల్లో ఎక్కడ గానీ రిజిస్ట్రేషన్ జరగడం లేదు. వివాహానికి కనీస వయసు ఉన్న వారు మాత్రమే ఎవరో ఒకరు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. మండల కేంద్రంలో, గ్రామీణ ప్రాంతాల్లో అక్కడక్కడా జరిగే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టేందుకు గ్రామాల్లో వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తీసుకొచ్చారు. దీని కోసం మండల స్థాయిలో ఓ కమిటీ కూడా ఏర్పాటు చేశారు. ఇందులో ఐసీడీఎస్, తహసీల్దార్, ఎంపీడీఓ, మహిళ పోలీసులతో పాటు, ఎస్‌ఐ, వైద్యాధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రధానంగా మహిళ పోలీస్‌తో పాటు ఐసీడీఎస్ సిబ్బంది బాల్య వివాహాలపై నిఘా పెట్టాలి. ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తున్నారు. వివాహ నమోదు కార్యక్రమం పటిష్టంగా అమలైతే బాల్య వివాహాలకు కొంతమేర అడ్డుకట్ట వేయవచ్చునని నిపుణులు చెబుతున్నారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

జీఓ నంబరు 193 ప్రకారం ప్రతీ పంచాయతీలో వివాహ నమోదును ఆయా గ్రామ కార్యదర్శులు చేయాలి. ఇందులో భాగంగా ముందుగా వరుడు, వధువు ఆధార్ కార్డులు, వయసు ధ్రువీకరణ పత్రాలు, పెళ్లి కార్డు, వ్యక్తిగత, పెళ్లి ఫొటోలు, ఇద్దరు సాక్షులు సంతకాలు, వారి ఆధార్‌కార్డులు సమర్పించాలి. వీటిని పరిశీలించి పంచాయతీ కార్యదర్శి వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు. పెళ్లి అయిన 60 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆ తరువాత కంప్యూటర్ ద్వారా ధ్రువపత్రం అందజేస్తారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్నాం



బాల్యా వివాహాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. బాల్య వివాహాలు చేస్తే వచ్చే అనార్థల గూర్చి కూడా ప్రజలకు తెలియజేస్తున్నాం. పెళ్లి అయిన వారు వివాహ నమోదు చేసుకుంటే చాలా మంచిది. మండలంలో ఎక్కడైన బాల్య వివాహాలు జరిగితే సమాచారం అందివ్వాలని ప్రజలకు సూచిస్తున్నాం.
– మణి మంజరి, ఎంపీడీఓ, గోనెగండ్ల

1 నుంచి ఎల్‌ఎల్‌సీకి నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న అధికారులు

ఆదోని సెంట్రల్: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు, ప్రజల తాగునీటి అవసరాలకై జూలై 1వ తేదీ నుంచి ఎల్‌ఎల్‌సీ కాలువకు నీటిని విడుదల చేయాలని డిస్ట్రిబ్యూటర్ కమిటీ సమావేశంలో డీఈఈ మహమ్మద్ షఫీవుల్లా, విద్యాసాగర్, సుబ్బరాయుడు, ఏఈ ఈశ్వర్, డిస్ట్రిబ్యూట్ కమిటీ సభ్యులు ప్రసాద్‌రావు, అనంతసేనరెడ్డి తదితరులు తీర్మానం చేశారు. సోమవారం స్థానిక టీబీపీ కార్యాలయంలో టీబీపీ ఈఈ పాండురంగయ్య, డిస్ట్రిబ్యూటర్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పుసుల్తాన్ సమక్షంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఖరీఫ్, రబీ పంటలను దృష్టిలో ఉంచుకుని మార్చి మొదటి వారం వరకు నీటిని విడుదల చేయాలని పలువురు పేర్కొన్నారు. 2025–26 సంవత్సరానికి గానూ ప్రతిపాదించిన 17.774 టీఎంసీల నీటిని పంపిణీ చేయాలని ప్రతిపాదించారు. లభ్యతను బట్టి 157.000 టీఎంసీల నీరు విడుదల చేయాలన్నారు.

టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని సీపీఐ పట్టణ మండల కార్యదర్శులు వీరేష్, కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. స్థానిక రెడ్డి హాస్టల్‌లో జరుగుతున్న మహాసభల్లో సోమవారం వారు మాట్లాడుతూ కొద్ది సంవత్సరాలుగా ఆదోని డివిజన్‌లో సరైన వర్షపాతం నమోదు కాకపోడంతో ప్రజలంతా ఉపాధి లేక బెంగళూరు, బొంబాయి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. నాయకులు లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాస్టల్‌లో సీట్లు ఇవ్వాలి

ఆదోని రూరల్: ఆదోనిలోని బీమా కాలేజీలో చదివే విద్యార్థులకు ఎస్సీ హాస్టల్ వార్డెన్ సీట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని, వెంటనే విచారణ చేపట్టి, విద్యార్థులకు సీట్లు ఇచ్చేలా చూడాలని డీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్ కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారిణి కె.వసుంధరకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు సర్కిల్‌లో ఉన్న ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో బీమా కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు వార్డెన్ సీట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాడన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి విద్యార్థికి సీట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

మంత్రాలయం రూరల్ : గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ..మండలంలో చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి ఎద్దడికి కూడా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవపుత్ర, రవి, ఎం వీరేష్, బాబుజీ పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

ఆదోని అర్బన్: పట్టణంలోని పరషాముల్లా కాలనీకి చెందిన లతీఫ్ అనే యువకుడిపై కార్వన్‌పేటకు చెందిన బీజేపీ నాయకుడు సోయెల్ సోమవారం తెల్లవారుజామున కత్తితో దాడి చేశారని టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సిగరెట్ విషయంలో తెల్లవారుజామున లతీఫ్‌పై బీజేపీ నాయకుడు సోయెల్ కత్తితో దాడి చేశాడన్నారు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారని, లతీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోయెల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శుద్ధనీటి సరఫరాకు కృషి

సాక్షి ఎఫెక్ట్



నీటిని శుద్ధి చేసేందుకు గ్యాస్ క్లోరినేషన్ సిలిండర్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలో శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఈఓ సతీష్ తెలిపారు. 'గోనెగండ్లలో కలుషిత నీటి సరఫరా' అనే శీర్షిక సోమవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు ఎస్‌ఎస్ ట్యాంకును పరిశీలించి గోనెగండ్లకు సరఫరా చేసే ట్యాంకులో క్లోరినేషన్ చేశారు. ఈఓ మాట్లాడుతూ క్లోరినేషన్ చేసే గ్యాస్ అయిపోవడంతో కుళాయిలకు కలుషితం, పాచి రంగు ఉన్న నీరు వచ్చిందన్నారు. సోమవారం నుంచి గ్యాస్ క్లోరినేషన్‌తో నీటిని శుద్ధి చేసి గ్రామానికి మంచినీటిని వదులుతున్నట్లు తెలిపారు. ఇక నుంచి గ్రామానికి శుద్ధి చేసిన మంచినీరే కుళాయిలకు సరఫరా అవుతుందని చెప్పారు.

మహాసభను జయప్రదం చేయాలి

నందవరం : ఈ నెల 28, 29వ తేదీల్లో కర్నూలులో జరిగే సీపీఐ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సీపీఐ జెండాను ఆ పార్టీ నాయకులు పంపన్న గౌడ్, సోమేశ్వరరెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా అబ్దుల్ కపూర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మన్సూర్, సోహెల్, నజీర్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ పూర్తిచేసే బదిలీలు చేయండి



గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సర్వేయర్లు

కౌతాళం: రేషనలైజేషన్ పూర్తి చేసిన తర్వాత సర్వేయర్లకు బదిలీ చేయాలని సచివాలయం సర్వేయర్లు సోమవారం పెన్‌డౌన్ నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డికి అందజేశారు. సర్వేయర్ల మండల అధ్యక్షుడు విరుపాక్షి, ఉపాధ్యక్షుడు ఉదయ్ రెడ్డి మాట్లాడుతూ తమకు ఎలాంటి ప్రమోషన్లు లేకుండా వేరే శాఖలకు బదిలీ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ప్రమోషన్లు ఇచ్చే బదిలీలు చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మహబుబ్‌బాషా, ట్రెజరర్ దస్తగిరిలు పాల్గొన్నారు.

ప్రమోషన్ల తర్వాతనే బదిలీలు చేయండి

కోసిగి: ప్రమోషన్ల తర్వాతనే బదిలీ చేయాలని సచివాలయం సర్వేయర్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం పెన్‌డౌన్ నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్‌ఐ శ్రీరాములకు అందజేశారు. సర్వేయర్ల మండల అధ్యక్షుడు సుంకన్న మాట్లాడుతూ తమకు ఎలాంటి ప్రమోషన్లు లేకుండా వేరే వేరే శాఖలకు బదిలీ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రమోషన్లు ఇచ్చే బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

సర్వేయర్లకు పదోన్నతి కల్పించాలి

గోనెగండ్ల : అర్హత కలిగిన సర్వేయర్లందరికీ పదోన్నతి వచ్చేలా సర్వీస్ రూల్స్‌లో మార్పులు చేయాలని విలేజ్ సర్వేయర్లు రవీంద్ర, అనిల్ కోరారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రం గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలియజేసి తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్లు విద్య, ఉదయ్, వెంకటేష్, రవి కుమార్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని టౌన్: ధణాపురం సర్పంచ్ చంద్రశేఖర్‌ను కుల వివక్షతో అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్టమ్మలపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్లు ఎరుకల రవి, దేవదాస్ కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారిణి కె.వసుంధరకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన ధణాపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్టమ్మ పర్యటించి దళిత సర్పంచ్‌ను కులం పేరుతో అవమానపరిచారన్నారు. వెంటనే విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దళిత గిరిజనుల నాయకులు దేవదాస్, ఎన్‌టీఎఫ్ నాయకులు ఎరుకల సూర్య, కేవీపీఎస్ నాయకులు విజయ్, శ్రీలక్ష్మి, వీరేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. సీనియర్ నాయకుడు మల్లయ్య మాట్లాడుతూ ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి గ్రామానికి అదనంగా పైపులైన్ ఏర్పాటు చేయాలని, అలాగే ప్రత్యేకంగా పంపింగ్ మోటార్‌ను ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని 15రోజుల కోకసారి నీరు వస్తున్నాయని అంతేకాక నీరు ఫిల్టర్ కాకుండా పచ్చగా వాసనతో వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఉలిగయ్య, రామలింగ, చిన్నమారయ్య, నాగరాజు, నరసప్ప, మహానంది పలువురు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ఆర్.ఎస్.ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారిణి వసుంధరకు వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్.ఎస్.ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేకున్నా ముందే అడ్మిషన్ ప్రారంభిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను యాజమాన్యం మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఉత్తేజ్, లోకేష్, ఉదయ్, ఉచ్చీరప్ప పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కోసిగి : మండల పరిధిలోని ఐరన్‌గల్ గ్రామానికి చెందిన బుజ్జమ్మ అనే వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో పొలం విషయంలో దాయాదుల మధ్య తగాదా నడుస్తోంది. ఈ విషయంపై దాయాదులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తరచుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని ఫోన్ చేసి ఒత్తిడి చేయడంతో మనస్థాపానికి గురై సోమవారం ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు తక్షణమే కోసిగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం 108అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విజయీంద్రతీర్థుల మధ్యారాధన

హొళగుంద: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో కొలువైన విజయీంద్రతీర్థుల 411వ ఆరాధనోత్సవంలో భాగంగా సోమవారం మధ్యారాధన పూజలు జరిగాయి. ఈ సందర్భంగా రాఘవేంద్ర, విజయీంద్రతీర్థుల మూలవిరాట్‌లను వెండి తొడుగులతో అలంకరించారు. పంచామృత, తులసీ అర్చన చేసి మహా నైవేద్యం సమర్పించారు. ప్రవచన, భజన, భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఉత్తరారాధన, రథోత్సవ, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు.

వెన్నుపోటు ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం



జెండా ఊపుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతూల్

ఎమ్మిగనూరుటౌన్: యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఏడాదైనా నెరవేర్చని వెన్నుపోటు కూటమి ప్రభుత్వానికి యువత బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతూల్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి వెళ్లే 15 వాహనాలను పట్టణంలోని పార్టీ కార్యాలయ వద్ద సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించగా యువత కర్నూలు తరలివెళ్లింది. ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఏడాది పాలన అయినా ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడునజీర్ అహమ్మద్, నాయకులు బోయరాజు, బి.బసిరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నందవరంలో పత్తి పంటలో మొక్కను పరిశీలిస్తున్న ఏఓ సరిత

నందవరం : రైతులు పత్తి పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి చీడపీడలు, తెగుళ్లు నివారించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి సరిత సూచించారు. సోమవారం మండల కేంద్రం పరిధిలో సాగుచేసిన పత్తి పంటలలో చీడ పీడలు, తెగుళ్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. పోడి వాతావరణం దృష్ట్యా పత్తి పంటకు పెను బంక ఆశిస్తుందన్నారు. పత్తి పంట సాగు చేసి 20 నుంచి 30 రోజులు కావడంతో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెను బంక ఆకు రసం పీల్చడంతో మొక్క గిడసబారుతుందన్నారు. మొక్క పెరుగుదల ఉండదని వివరించారు. దీని నివారణకు రైతు అసిఫేట్ 1.5 గ్రాములు లేదా అపిడోపైరోపెన్ 1.5 మిల్లీ మీటర్లు లీటర్ నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో రక్షణగా అంతర్ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి

పెద్దకడబూరు : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం ఉమారాజేశ్వరి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువగా యుక్త వయస్సులోనే ఎక్కువగా చెడు అలవాట్లకు ఆకర్షించబడుతారన్నారు. ఈవయస్సులో తమ కోరికలను అదుపులో పెట్టుకుంటే భవిష్‌త్‌లో ఎలాంటి చెడు అలవాట్లుకు లోనుకారని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు కార్తీక్‌సాగర్, నాగేంద్ర, పోలీసు సిబ్బంది మునిరంగడు, భరత్, తిక్కయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై కార్మికుల వినూత్న నిరసన



సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలియజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: గత 48 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికై సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటంతో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఇంజనీరింగ్ కార్మికులు ర్యాలీగా వెళ్లి సోమప్ప సర్కిల్ వద్ద రోడ్డుపై బైఠాయించి వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వానికి తమ గోడు వినపడటం లేదని పేర్కొంటూ కళ్లు, చెవులు, నోరు మూసుకొని నిరసన తెలుపుతూ రాస్తారోకో చేశారు. యూనియన్ నాయకులు నారాయణ, రాజేంద్ర మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,200 నెలసరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాని, జాతీయ సెలవులతో పాటు ఆదివారం సెలవుదినంగా ప్రకటించాలన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి దీక్షలో కూర్చున్నారు.

సూర్య ఘర్ యోజనను ఉపయోగించుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కోసిగి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ఉపయోగించుకోవాలని ట్రాన్స్‌కో వీరేష్ కోరారు. సోమవారం కోసిగిలో ఈ పథకంపై ర్యాలీ చేసి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరూ సబ్సిడీపై అందించే సోలార్ విద్యుత్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. గృహ, కమర్షియల్ వినియోగదారులు కూడ సోలర్‌ను వేసుకోవచ్చు అన్నారు. ఇందుకు అయ్యే ఖర్చు కోసం బ్యాంకు లోన్ కూడా ఇస్తుందని చెప్పారు.

రజకులు విద్యాపరంగా రాణించాలి



మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

ఆదోనిసెంట్రల్: రజకులు విద్యాపరంగా రాణించాలని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. ఆదోని పట్టణ రజక ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో సోమవార పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్యోగ సంఘం నాయకులు నాగరాజు అధ్యక్షతన మరాఠీ వీధి జగన్నాథ దేవాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ రజకులు విద్యాపరంగా, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం గుర్తిస్తుందన్నారు. సమావేశంలో చిన్నహరివాణం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం కుసుమాంబ, తాలూకా సీఐ నల్లప్ప, రజక సంఘం నాయకులు, రజకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిలైన వారికి ఉద్యోగావకాశాలు

కర్నూలు (హాస్పిటల్): ఇంటర్ ఫెయిలైనవారికి జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సులలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడి స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు బీఎస్సీ/డిప్లొమా పారా మెడికల్/నర్సింగ్/బీపీడీ కోర్సులలో ప్రవేశం నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు పీజీ కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు స్థానిక జోహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్ క్యాంపస్‌లో ఉన్న బొల్లినేని మెడి స్కిల్స్ 86865 94534, 76809 45357 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల కౌన్సెలింగ్ కొనసాగుతోంది. జి.పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు హెల్ప్ డెస్క్ సెంటర్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతోంది. రెండో రోజు సోమవారం మొత్తం 200 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను వెరిఫై చేసి, విద్యార్థులకు రిజిస్ట్రేషన్ కమ్ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌లను అందజేశారు. వెరిఫికేషన్‌కు హాజరైన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకునే అవకాశం ఉంది.

ఆర్‌ఎంపీ క్లినిక్‌ల తనిఖీ



మంత్రాలయంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ గోవిందమ్మ

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రం మంత్రాలయంలో సోమవారం ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై వైద్యాధికారులు తనిఖీలు చేపట్టారు. గ్రామంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి ఆదేశాల మేరకు 6 ప్రథమ చికిత్స కేంద్రాలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు గోవిందమ్మ, సురేష్ విచారణ చేశారు. వారు మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని ఆదేశించారు. ఆర్‌ఎంపీల వద్ద అర్హత పత్రాలు, క్లినిక్ కేంద్రాలలో మందులు ఉన్నాయా, లేదా అని విచారణ చేశామన్నారు. ఆర్‌ఎంపీలు సెలైన్ బాటిల్స్, స్టెరాయిడ్ వంటి ముందులు వాడకూడదని, నియమ నిబంధనలు పాటించకపోతే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మధవ స్వామి, ఎంఎల్‌హెచ్‌పీ జయంతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.